రేషన్ కార్డుల సర్వే పరిశీలన

బాన్సువాడ రూరల్, జనవరి 17 : బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో ప్రభుత్వం నిర్వహించిన రేషన్ కార్డు సర్వేను బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఇంటింటా చేపడుతున్న సర్వే విధానాన్ని ఆయన పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, జూనియర్ అసిస్టెంట్ అశోక్ ఉన్నారు.

వ్యవసాయ భూముల సర్వే

రాజంపేట్, జనవరి 17 : రాజంపేటలో వ్యవసాయానికి యోగ్యం కాని భూముల సర్వేను నిర్వహించినట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి అపర్ణ, నాయబ్ తహసీల్దార్ సంతోషి, ఏవో శ్రుతి, ఏఈవో శిల్ప, సర్వేయర్ కిరణ్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రత మనందరి బాధ్యత

సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

బాన్సువాడ టౌన్, జనవరి 17 : బస్సులో ప్రయాణించే వారి భద్రత మనందరి బాధ్యత అని ఆర్టీసీ ఎంవీఐ శ్రీనివాస్ తెలిపారు. బాన్సువాడ ఆర్టీసీ బస్ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్ డిపో పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సీట్ బెల్స్ ధరించడం తదితర విశయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రమాదరహితంగా బస్సును నడిపిన డ్రైవర్లు అబ్బాస్ అలీ, పీవీ రెడ్డి, ఎక్కువగా కేఎంపీఎల్ మెయింటెన్ చేసిన డ్రైవర్ గణేశ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బాన్సువాడ బస్ డిపో మేనేజర్ సరితాదేవి, సీఐ జానాబాయి, సిబ్బంది బసంత్, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

కామారెడ్డి, జనవరి 17 : జిల్లా కేంద్రంలో రోటరీ క్లబ్‌లో శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రాజనరసింహారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునేందుకు కుట్టు మిషన్లు ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ సత్యం, మాజీ అసిస్టెంట్ గవర్నర్ శ్రీశైలం, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి సబ్బాని కృష్ణహరి, లక్ష్మీనర్సయ్య, కాశీనాథం, నాగభూషణం, చంద్రశేఖర్, డాక్టర్ బాలరాజ్, కాశీనాథ్ రావు, జగన్నాథం, సుధాకర్ రావు, బాలకిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సైకు ఎస్సైగా ఉద్యోగోన్నతి

నస్రుల్లాబాద్, జనవరి 17 : నస్రుల్లాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏఎసైగా రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వెంకట్రావుకు ఎస్సైగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్సైగా కామారెడ్డి జిల్లా కేంద్రానికి వెళ్లనున్నారు. ఈ మేరకు నస్రుల్లాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై లావణ్య, పోలీస్ సిబ్బంది ఆయనను శుక్రవారం అభినందించారు.

కామారెడ్డి రైల్వే స్టేషన్

కామారెడ్డి రైల్వేస్టేషన్‌కు మహర్దశ

కొత్త హంగులతో సిద్ధమవుతున్న స్టేషన్

స్టేషన్‌లో కొనసాగుతున్న పనులు

కామారెడ్డి, జనవరి 17 : కామారెడ్డి రైల్వే స్టేషన్‌కు మహర్దశ రానున్నది. ప్రయాణికులకు ప్రపంచస్థాయి సౌకర్యాలను అందించాలనే ఉద్దేశంతో భారీ స్థాయిలో రైల్వే స్టేషన్లను భారతీయ రైల్వే అభివృద్ధి చేస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ క్రింద 40 రైల్వే స్టేషన్లను రూ. 2,737 కోట్ల అంచనా వ్యయంతో ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలను అందించడానికి, వాటిని ప్రాంతీయ జనాభాకు వృద్ధి కేంద్రాలుగా మార్చడానికి ఎంపిక చేసిన పునరాభివృద్ధి చేస్తున్నారు. ప్రధాని మోదీ ఆగస్టు 2023, ఫిబ్రవరి 2024లో రాష్ట్రంలో స్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన చేయడంతో ఈ పథకం ఊపందుకున్నది. ఇందులో కామారెడ్డి రైల్వే స్టేషన్ కూడా ఎంపికైంది. కామారెడ్డి ప్రధాన కేంద్రంగా ఉండడంతో ఈ స్టేషన్‌ను ఎంపిక చేశారు. కామారెడ్డి రైల్వేస్టేషన్ 1896లో 629 కి.మీ పొడవుతో హైదరాబాద్ నుంచి మన్మాడ్ జంక్షన్ వరకు రైలు మార్గం ప్రారంభించారు. ఇది దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ఉంది. పూర్వం నిజాం గ్యారెంటీడ్ స్టేట్ రైల్వే, గోదావరి వ్యాలీ రైల్వేలతో నిర్మించబడింది. సికింద్రాబాద్ –మన్మాడ్ రైల్వేలైన్ అని పిలవబడింది. సికింద్రాబాద్– మన్మాడ్ తెలంగాణ, మహారాష్ట్రను అనుసంధానం చేస్తున్న ఒక ముఖ్యమైన రైలు మార్గం. సికింద్రాబాద్–మన్మాడ్ రైలు మార్గం కామారెడ్డిని కలిపితే భారతదేశంలోని ప్రధాన నగరాల్లోని వివిధ ప్రాంతాలకు వ్యవసాయ ఉత్పత్తులు, ప్రయాణికులకు రవాణా సేవలను అందించే ప్రధానమైన వనరు. ఈ స్టేషన్‌ను అమృత్ భారాత్ స్టేషన్ పథకం కింద సుమారు రూ. 39.84 కోట్లతో పునరాభివృద్ధి చేయడానికి గుర్తించారు. సుమారు 360 చ.మీ విస్తీర్ణంతో స్టేషన్ భవన నిర్మిస్తున్నారు. స్టేషన్ ప్రాంగణం సుమారు 2,450 చ.మీలుగా ఉన్నది. ప్రయాణికుల సౌకర్యార్థం మూడు లిఫ్టులు, రెండు ఎస్కలేటర్లతోపాటు 12 మీటర్ల వెడల్పు ఉన్న పాదాచారుల వంతెన నిర్మిస్తున్నారు. దివ్యాంగుల సౌకర్యార్థం టాయిలెట్లను నిర్మించనున్నారు. ప్రయాణికులకు అనుకూలంగా కోచ్‌లు కలిపే, రైళ్ల రాకపోకలను తెలియజేసే సూచిక బోర్డులు, వీఐపీ లాంజ్ అభివృద్ధి పనులు చేయనున్నారు. అన్ని పనులు శర వేగంగా కొనసాగుతున్నాయి.

పారిశుద్ధ్య పనులు చేయించిన అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పారిశుద్ధ్య పనులను చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి యాదగిరి

బీబీపేట్ (దోమకొండ), జనవరి 17 : దోమకొండలోని 16వ వార్డులో ఉన్న సంఘం టాకీస్ సమీపంలో లింగం వద్ద, 6వ వార్డులో వాటర్ ప్లాంట్ సమీపంలో ఉన్న మురికి కాలువలను అధికారులు శుభ్రం చేయించారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన శుక్రవారం ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ సెక్రటరీ యాదగిరి స్పందించి, పారిశుద్ధ్య పనులు చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, జనవరి 17 : కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో తెలుగు, చరిత్ర సబ్జెక్టులు బోధించేందుకు అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ పాసై ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం ఉండాలని తెలిపారు. కళాశాల విద్యా కమిషనర్ నిబంధనల ప్రకారం ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు సాయంత్రం 4 గంటల లోగా కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

కామారెడ్డి, జనవరి 17 : జిల్లా కేంద్రంలోని కళాభారతిలో ఈ నెల 20, 21వ తేదీల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వర్ రావు బృందంతో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు చిలివేరి మారుతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్మీడియెట్ విద్యార్థులకు, 21న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డిగ్రీ, పీజీ విద్యార్థులతోపాటు ఉద్యోగులు, వ్యాపారులు, తల్లిదండ్రులు, యువతకు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం

కామారెడ్డి, జనవరి 17 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం సాధారణ సమావేశం నిర్వహించారు. నూతనంగా మార్కెట్ కమిటీ ఏర్పాటైన సందర్భంగా మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు, మార్కెట్ కమిటీకి తగు ఆదాయం సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని పాలకవర్గం నిర్ణయించింది. అనంతరం నూతన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మిని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ సన్మానించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించిన అధికారులు

బాన్సువాడ, జనవరి 17 : బాన్సువాడ సబ్‌డివిజన్ ట్రాన్స్‌కో కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికకు వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన వినియోగదారుల నుంచి వచ్చిన సమస్యలపై అధికారులు స్పందించారు. ఎస్ఈ శ్రావణ్‌కుమార్, డీఈ ప్రభాకర్ రావు, ఏడీఈ సంజీవరావు, రూరల్ ఏఈ అనిల్ కుమార్, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు నష్టం జరగొద్దు

ధర్మారెడ్డిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

లింగంపేట/ నాగిరెడ్డిపేట, జనవరి 17: రైతు భరోసాలో అర్హులకు నష్టం జరుగకుండా సర్వే నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి, లింగంపేట మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి, ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో చేపడుతున్న సర్వేను ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో శుక్రవారం వరకు సాగుకు యోగ్యంలేని 1060 ఎకరాల భూమిని గుర్తించినట్లు తెలిపారు. ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలను ఏర్పాటుచేసి సర్వే వివరాలను గ్రామస్తులకు తెలియజేయాలన్నారు. ఆయనవెంట ఆర్డీవో ప్రభాకర్, నాగిరెడ్డిపేట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ప్రభాకర్, లింగంపేట తహసీల్దార్ నరేందర్‌గౌడ్, మండల వ్యవసాయ శాఖ అధికారి అనిల్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ సంగమేశ్వర్, ఏఈవోలు ఉన్నారు.

సాగుకు యోగ్యం కాని భూములను పక్కాగా పరిశీలించాలి

రేషన్‌కార్డుల సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బిచ్కుంద, జనవరి 17: సాగుకు యోగ్యం కాని భూములను సర్వే సిబ్బంది పక్కాగా పరిశీలించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. జుక్కల్ మండలంలోని తహసీల్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 20వ తేదీ వరకూ చేపట్టే సర్వేలో వ్యవసాయానికి అనువుగా లేని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని భవానీతండాలో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేను పరిశీలించారు. అర్హులను గుర్తించి నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ హిమబిందు, ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్ఐ రామారావు, మండల వ్యవసాయాధికారిణి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సూపర్ చెక్ సర్వే

లింగంపేట, జనవరి 17: లింగంపేట మండలంలోని శెట్పల్లి, పర్మళ్ల, శెట్పల్లి సంగారెడ్డి, మాలపాటి, ఎక్కపల్లి, సజ్జన్‌పల్లి గ్రామాల్లో ఎంపీడీవో నరేశ్ శుక్రవారం సూపర్ చెక్ సర్వే నిర్వహించారు. ఇందిరమ్మ గృహాల కోసం పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను సూపర్ చెక్ చేపడుతున్నారు. సర్వే వివరాలను పరిశీలించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఎంపీడీవో నరేశ్ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, **YLALA BANGLA RAJENDER**, H.No.1-4/1, Yelalawada, Vil & Mdl. Morthad, Dist. Nizamabad, T.S., Changed my name as **YELALA RAJENDHAR REDDY** S/o. Yelala Rajeshwar (new name)
NTZ-338395

CHANGE OF NAME
★I, **YLALA LAVANYA**, H.No.1-4/1, Yelalawada Vil & Mdl. Morthad, Dist. Nizamabad, T.S., Changed my name as **YELALA LAVANYA REDDY** W/o. Yelala Rajendhar Reddy (new name)
NTZ-338395

CHANGE OF NAME
★I, **YLALA BANGLA RAJESHWAR**, H.No. 1-4/1, Yelalawada, Vil & Mdl. Morthad, Dist. Nizamabad, T.S., Changed my name as **YELALA RAJESHWAR** S/o. Yelala Somanna (new name)
NTZ-338395

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్వే నిర్వహించాలి

పిట్లం శివారులో రైతు భరోసా సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

పెద్దకొడప్‌గల్, జనవరి 17: ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రైతు భరోసా సర్వే నిర్వహించాలని అధికారులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. పిట్లంతోపాటు చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో చేపడుతున్న సర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈనెల 21వ తేదీ వరకు సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయనవెంట తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఆర్ఐ శీతల్, ఏవో కమల, ఏఈవో వీణ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

- న్యాయం చేయాలని మృతుడి బంధువుల రాస్తారోకో
- కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం
- సీఐ హామీతో ఆందోళన విరమించిన గిరిజనులు

ప్రమాదానికి కారణమైన లారీ

కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

మోహన్(ఫైల్)

లింగంపేట, జనవరి17: మండలంలోని ముస్తాపూర్ తండాకు చెందిన సబావత్ మోహన్(29) రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మోహన్ గురువారం సాయంత్రం పశువులను తీసుకుని ఇంటికి వస్తుండగా ముస్తాపూర్ గ్రామ శివారులో కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వైపు వెళ్తున్న లారీ ఢీకొన్నది. తీవ్ర గాయాలైన అతడిని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి అంబ్రియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

న్యాయం చేయాలని బంధువుల ఆందోళన..

మోహన్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ తండా వాసులు, గిరిజనులు కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణం బలైందని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రమాదం సంభవించి 24 గంటలు గడిచినా లారీ ఓనర్ స్పందించక పోవడంతో గిరిజనులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సముదాయించారు. రాస్తారోకో చేయడం సరికాదని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ గిరిజనులకు సూచించారు. గంటపాటు గిరిజనులు రాస్తారోకో చేయడంతో రహదారి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని సీఐ తెలుపడంతో గిరిజనులు రాస్తారోకో విరమించారు. సీఐవెంట స్థానిక ఎస్సై సుధాకర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పెద్దకొడప్‌గల్, జనవరి 17: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన పిట్లం మండలంలోని చిన్న కొడప్‌గల్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన గొరిగె సత్యవ్వ(55) వివాహం అల్లాపూర్ గ్రామానికి చెందిన అంజిగొండతో 38 సంవత్సరాల క్రితం జరిగింది. ఆమెకు ఒక కుతురు కూడా ఉన్నది. 35ఏండ్ల క్రితం గొడవలు జరగడంతో వారు విడిపోయారు. అప్పటి నుంచి సత్యవ్వ చిన్నకొడప్‌గల్‌లోనే ఉంటున్నది. కాగా ఆమె గురువారం ఉదయం నుంచి కనిపించడం లేదని సత్యవ్వ అన్న పాపుగొండ ఇంటికి వెళ్లి చూశాడు. అప్పటికే ఆమె చనిపోయి ఉన్నది. ముక్కు నుంచి రక్తం రావడం, ఆమె ఒంటిపై ఉన్న నగలు దొంగిలించినట్లు గుర్తించాడు. గుర్తు తెలియని దుండగులు హత్య చేశారని పాపుగొండ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పెద్దకొడప్‌గల్, జనవరి 17: అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అధికారులకు సూచించారు. పిట్లంలో తహసీల్దార్, ఎంపీడీవోలతో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 26నుంచి రైతు భరోసా అమలుచేయడంతోపాటు రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని, సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి రూరల్), జనవరి17: ఎల్లారెడ్డి మండలం ఆజామాబాద్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరైన రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ జడ్పీటీసీ సామెల్ తదితరులు పాల్గొన్నారు.

బడిబయటి చిన్నారుల గుర్తింపు

లింగంపేట/ నిజాంసాగర్, జనవరి 17: మండలంలోని ఎల్లమ్మతండా, ముస్తాపూర్, గాంధీనగర్ తదితర గ్రామాల్లో శుక్రవారం బడిబయటి చిన్నారుల గుర్తింపు కోసం సర్వే నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి షౌకత్ అలీ తెలిపారు. ఆయా క్లస్టర్ల సీఆర్పీలు ముస్తాపూర్‌లో ఇద్దరు బడీడు పిల్లలను గుర్తించారని చెప్పారు. చదువు ఆవశ్యకతను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. సీఆర్పీలు గంగాధర్, సంగాగౌడ్ పాల్గొన్నారు. నిజాంసాగర్ కాంప్లెక్స్ పరిధిలోని బంజపల్లి హాబిటేషన్‌లో హర్షత్‌కుమార్ అనే బడీడు పిల్లాడిని గుర్తించినట్లు సీఆర్పీ నర్సింహులు తెలిపారు. అతడిని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాలుడి తల్లిదండ్రులు రేణుక – సాయిలు తదితరులు ఉన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 28 సెంటర్లు

నిజాంసాగర్, జనవరి 17: జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాల కోసం నేడు (శనివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని నిజాంసాగర్ నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ మనుజే యోహనన్ తెలిపారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గం టల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షకు విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలని, 11 గంటల అనంతరం లోనికి అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు.

వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

లింగంపేటలో కళాబృందం ప్రదర్శన

లింగంపేట, జనవరి17: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసు కళాజాత బృందం సభ్యులు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు. కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బన్సీ, సాయిలు, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.